# బంధాలు - బాంధవ్యాలు

రచన: శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి

"ఏవమ్మా.... చీకట్లో నిలబడ్డావేం.... ఇట్లారా...." అంటూ రాఘవయ్య పిలిచేసరికి కమల మెల్లిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది

"అగన్నేరు చెట్లకింద ఎందుకమ్మా.... పురుగూ పుట్ర ఉంటుంది...." అంటూ గోడకానించిన మంచాన్నివాల్చి మెల్లిగా దానిమీద కూర్చున్నాడు.

కమల అలాగే నిలబడి ఉంది.

"అమ్మ ఎక్కడికి వెళ్ళింది...." అని అడిగాడు రాఘవయ్య. అప్పటికీ సమాధానం రాకపోయేటప్పటికి తలఎత్తి కమల వంక చూశాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ముఖంమీద ఏదో నీడలు కదులుతున్నాయి. రాఘవయ్య మనస్సు చివుక్కుమంది.

'ఇట్లారామ్మా కమలా....' రాఘవయ్య కమలను తనపక్కనే మంచంమీద కూర్చోపెట్టుకుని బుజ్జగింపుగా వీపుమీద చెయ్యివేసి 'అసలు సంధ్యవేళ.... ఆడవాళ్లు కన్నీళ్లు పెట్టుకోవచ్చునా.... తప్పుకాదు..' అన్నాడు. కమల వంచినతల ఎత్తకుండా పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ 'ఏం నాన్న.... వక్క మాట అడగనా ....' అంది.

రాఘవయ్య నిర్ఘాంత పోయాడు కమల వాలకం చూసి.

'అడుగమ్మా .... నాదగ్గరేమిటి నీకు అనుమానం....'

'మీకు బరువయ్యానా నాన్న.... నేను....'

రాఘవయ్యమీద పిడుగు పడ్డంత పనయింది. కమలను హృదయానికి దగ్గరకు చేర్చుకుని 'ఎంతమాటన్నా వమ్మా....' అంటూ పెదిమలు కదిలించాడు. గాత్రం వణికింది. ముఖంమీద చిరుచెమట పట్టింది. ఆ ఇంటి వాతావరణం భయంకరంగా తోచింది కమల అక్కడ నుంచి లేచి ఇంట్లోకి వెళ్లిపోయింది.

రాఘవయ్య మంచంమీద వంటరిగా కూర్చుని ఆలోచించటం మొదలు పెట్టాడు. అనేకమైన ఊహలు అతని మనసును కల్లోలపరచ సాగినాయి. కమల చిన్ననాటి సంగతులెన్నో గుర్తుకు వచ్చినాయి.

లేక లేక కలిగిన సంతానం కమల. పుట్టిన బిడ్డలందరూ పురిటిలోనే చనిపోతుంటే రాఘవయ్య చేసేది కనబడక దేశమంతా తీర్థయాత్రల పేరిట తిరిగివచ్చాడు. కమల తల్లి నరసమ్మ ఉన్ననోములన్నీ నోచింది. ఉన్న దేవతలందరకూ మొక్కింది. అన్నినోముల పంటగా ఆ ఇంటి వెలుగుగా కమల జన్మించింది. కమల పుట్టిననాటినుంచీ ఆ ఇంటి తీరే మారింది. బూజువేళ్లాడుతూ దుమ్ము కొట్టుకొనిఉన్న ఇల్లు కళకళ లాడ సాగింది.

బంగారంవంటి శరీరఛాయ, దేవతలాగా కనపడే కనిముక్కు తీరు. సిల్కు బట్టల్లో కమల అందెల చప్పుడు చేసుచేసుకుంటూ ఆ ఇంట్లో నడుస్తుంటే కనుల పండువుగా ఉండేది, ఆ దంపతుల మనసు ఆనందంతో నిండి ఉండేది.

కమలకు పెళ్లివయసు వచ్చేటంత వరకూ ఇంట్లో సమస్యలేలేవు. అప్పుడు 'అమ్మాయికి సంబంధం ఎక్కడన్నా చూడరాదుటండీ.. ' అంటూ నరసమ్మ రోజూ పోరుపెటుతూంటే, రాఘవయ్య మాత్రం తొణక్కుండా ! 'ఆ వచ్చే వాడెవడో వెతుక్కుంటూ మనింటికే వస్తాడు ఊరుకోవే....' అంటుండేవాడు నరసమ్మ అంతటితో ఊరుకునేది కాదు.

'మీరట్లాగే అంటుండండీ.... శ్యామల వెళ్లయిందా.... కమలకంటే ఆరునెలలు చిన్నగూడాను.... అంటూ ఎరుగున్నవాళ్ల సంగతి చెప్పేది.

రాఘవయ్యా తక్కువతిన్నవాడేంకాదు.

'రమ, కళ్యాణి, పార్వతి....వీళ్ళందరి సంగతిచెప్పవేం.... వాళ్లంతా మన కమలకంటే పెద్దవాళ్ళు కాదూ....' అనేవాడు.

'ఊళ్లోవాళ్లదరితో వంతేమిటీ.... మన అమ్మాయి పెళ్లిసంగతి మనంచూసుకోవాలిగాని...' అని సమధానం చెప్పేది.

రాఘవయ్య సంభాషణ నవ్వులాట కింద తేల్చేశాడు.

'పిచ్చిదానా.... మనం తొందరపడితే అవుతుందటే.... ఆఘడియరావాలిగాని...' అన్నాడు.

'ఆ ఘడియ అయినా మన తియ్యందే వస్తుందేమిటి....' అంది నరసమ్మ. రాఘవయ్య నవ్వాడు. నరసమ్మ నవ్వింది.

'నువ్వు నవ్వుతుంటే బాగుంటావు ...' అన్నాడు రాఘవయ్య.

'పెళ్ళీడుకొచ్చిన పిల్లఉంది.... మనవా చిలిపి చేష్టలు పోలేదు....' అంటూ పమిట సర్దుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది.

చివరికి నరసమ్మమాటే నెగ్గింది

పెళ్లికొడుకులు చాలమందివచ్చి చూచి వెళ్లారు.

'ఏవమ్మా కమలా.... నీకెవరునచ్చారు' అని అడిగాడు కమలను పక్కకూర్చోపెట్టుకుని. కమల వంచినతల ఎత్తలేదు.

'దాన్ని అడిగితే ఏంతెలుస్తుంది........ ఆ బి. యల్. చదివాడన్నారే ఆ అబ్బాయి బాగానే ఉన్నాడు... ' అంది నరసమ్మ.

'ఈసంబంధం చేసుకునేది ఎవరు.... నువ్వా.... కమలా....' అన్నాడు రాఘవయ్య నవ్వుతూ, కమల నవ్వు ఆపుకోలేకపోయింది. పక్కుమని నవ్వింది. నరసమ్మకు కొంచెం ఉక్రోషం వచ్చిందిగాని కమల నవ్వటంచూసి తనూ నవ్వింది.

'నేను ఇవన్నీ చూసి చేసుకోలేదు.... అంది నరసమ్మ. కమల అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది.

'కమలకుకూడా అబియల్, కుర్రాడే నచ్చాడండీ.... నేనామాట అన్నప్పుడు దాని ముఖం చూశారుగా ఏమంటారండీ, అంది నరసమ్మ. అసంబధమే ఖాయమయినందుకు నరసమ్మ గర్వపడింది. ఆమె మనసు ఆనందంతో అంచులదాకా నిండింది.

పెళ్లిపందిర కళకళ లాడుతోంది. పూజలు, పునస్కారాలూ అయిపోతున్నాయి కన్యాదానం చెయ్యవలసిన సమయం వచ్చింది. పురోహితుడు మంత్రాలు పఠిస్తున్నాడు రాఘవయ్యకు అదేమీ వినిపించటంలేదు. కమలను పెంచి పెదనాన్నిచేశాడు. ఒక పరాయివాడి చేతుల్లో ఉంచుతున్నాడు. గుండెల్లో ఏదోబాధ గుబు గుబులుగా వస్తోంది. కళ్లల్లో నీళ్లు, కళ్యాణ మండపం కదిలి పోతున్నట్లనిపించింది.

'అబ్బ కళ్లల్లోకి పొగవస్తుంటే.... అగ్నిహోత్రాన్ని అట్లా వదిలి పెట్టారే.... కొంచం విసరరాదుటండీ అంటూ పురోహితుణ్ణి మందలిస్తూ ఉత్తరీయంతో కళ్లు తుడుచుకున్నాడు. నరసమ్మకు అవేం తోచలేదు. తను కనిపెంచిన కూతురిపెళ్లి చేస్తోంది. అదే గొప్ప. ఆడపిల్ల అన్న తర్వాత ఎప్పటికయినా అత్తవారింటికి వెళ్లి పోవలసిందే, ఎవరిదాకా ఎందుకు? తను ఎక్కడ పుట్టింది! ఎక్కడ పెరిగింది!! ఇక్కడకు వచ్చి కుటుంబగా ఏర్పడి పుట్టింటివారి సంగతే మరిచిపోలేదూ....నరసమ్మ కవన్నీ బాగానే తెలుసు. గుండె నిబ్బరం చేసుకుని ఊరుకుంది-కాని అంపకుల వేళ దుఃఖం ఆపుకోలేకపోయింది. కమలను కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది. "అదేమిటే మరీను....ఎవరన్నా చూస్తే నవ్వుతారు ..." అంది ఒక ముసలమ్మ.

రాఘవయ్య దూరంగా ఉండి ఇదంతా చూస్తునే ఉన్నాడు. అతను నవ్వలేదు. ఎవరికీ కనపడకుండా కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

పెళ్ళి అయేదాకా తొందరపడ్డ నరసమ్మ కమల అత్తవారింటికి వెళ్లినప్పటి నుండి దిగులు పడిపోయింది.

"అమ్మాయిని వక్కసారి తీసుకుని రండీ...." అంటూ పోరు పెట్టింది. రాఘవయ్య వెళ్లి అడిగితే "పెళ్లిచేసుకుంది పుట్టింటి దగ్గర అట్టిపెట్టటానికా...." అని సమాధానం చెప్పేవాడు. మరీ పట్టుపడితే "మీ అమ్మాయి వస్తానంటే తీసుకుని వెళ్లండి...." అన్నాడు అల్లుడు. అందరి సమక్షంలో కమల కనపడింది. "ఇప్పుడు రానులే నాన్నా...." అని సమాధానం చెప్పింది. కమలను వంటరిగా కలుసుకుని మాట్లాటం రాఘవయ్యకు కుదరనే లేదు. వాళ్ల తత్వ మేమిటో అతనికి బోధపడలేదు.

నరసమ్మ బాగా దిగులు పడిపోయింది. రాఘవయ్య లోపల కృంగిపోతూ బయటకు నరసమ్మమీద అహంకార పడుతూండేవాడు. పెళ్లో.... పెళ్లో.... అని నా ప్రాణాలు కొరికావు.... నిదానంగా చూస్తే ఇంతకంటె మంచి సంబంధం దొరక్కపోయ్యేదా.... అప్పుడు తొందరపెట్టావు ఇప్పుడనుభవిస్తున్నాం...." అనేవాడు. నరసమ్మకు ఈ మాటలు ములుకుల్లాగా గుచ్చుకోసాగినాయి. కమలను ఎందుకు పంపించటం లేదో వాళ్లకి అర్ధంకాలేదు.

ఉత్తరం ముక్కన్నా లేకుండా ఒక రోజు సాయంత్రం అల్లుడూ, కూతురూ దిగారు. అప్పుడే చీకటి పడుతోంది. రాఘవయ్య వాళ్లని గుర్తుకూడా పట్టలేదు. "ఎవరూ...." అంటూ వాకిట్లోకి వచ్చేటప్పటికి వీళ్లద్దరూ....

"నరసూ.... కడుక్కోటానికి నీళ్లు తీసుకునిరా.... అమ్మాయి వాళ్లు వచ్చారు" రాఘవయ్య సంతోషం పట్టలేకపోయాడు. కమలను కావలించుకున్నాడు తాను ముద్దు పెట్టుకున్నాడు. జుట్టంతా కన్నీటితో తడిసిపోయింది. కమల కూడా చిన్న పిల్లలాగా బావురుమంది.

"అమ్మాయి కావాలన్నారుగా.... దిగపెట్టి పోవటానికి వచ్చాను...." అన్నాడు అల్లుడు ముక్త సరిగా. రాఘవయ్యకు మాటలు దొరకలేదు.

"సరే వస్తానింక...." అంటూ అల్లుడు వీధి వైపుకి బయలుదేరాడు. రాఘవయ్య నిశ్చేష్టుడయ్యాడు.

"అప్పుడే....! వారం రోజులుండి పోదువుగాని...." అన్నాడు రాఘవయ్య మాటలు తడబడుతూ.

"అర్జెంటు పనులున్నాయి లెండి.... మీకు కావాలసింది అమ్మాయేగా....!" అంటూ వీధిలోకి చరా చరా వెళ్లిపోయాడు.

నరసమ్మ నీళ్లబిందె ఇత్తడి చెంబుతో వచ్చింది.

"అల్లుడు ఏడీ....! అంది. వీధిలోకి చెయ్యి చూపించాడు రాఘవయ్య. కమల వచ్చి తల్లి వళ్ళో వాలింది.

"అప్పుడే వెళ్లిపోవడమే!" అని అడిగింది నరసమ్మ. కమల మౌనంగా ఊరుకుంది. రాఘవయ్య ఏమీ అడగలేదు. అతనికి వాళ్లమీద ఉన్న అనుమానాలు ధృఢమౌతున్నట్లనిపించింది. ఏదో గొడవగా ఉందని ఖాయం చేసుకున్నాడు. ఆ రాత్రి తల్లి కూతుళ్ళిద్దరూ ఒక మంచం మీద పడుకున్నారు. తండ్రి పక్కనే పెద్ద పట్టె మంచం మీద పడుకున్నాడు. రాత్రి ఎవరికీ నిద్ర పట్టలేదు. అర్ధరాత్రియ్యే వరకు చాలా సంగతులు అడుగుతూనే ఉంది నరసమ్మ.

"అత్తా మామా బాగా చూస్తున్నారా...."

"ఇరుగు పొరుగు ఎలాంటివాళ్లు...."

అన్నీ ఇలాంటి ఉన్నవే.

"కాసేపు దాన్ని పడుకోనియ్యరాదూ" అంటూ విసుక్కున్నాడు రాఘవయ్య.

మొత్తానికి నరసమ్మ అన్ని సంగతులు బయటకు లాగింది. అల్లుడి ధోరణి అంత మంచిదిగాదు. వాళ్ళఆస్థితో పాటు అనేకమైన దుర్వ్యసనాలు గూడా ఉన్నాయి. అల్లుడు రోజూ రాత్రి పన్నెండు దాటిన తర్వాత గాని ఇంటికి రాడు. ఊళ్లోనే ఎక్కడో గదిలో అతనూ, అతని స్నేహి

తులూ అంతాచేరి చీట్లాడతారు. పెళ్ళయే నాటికే అతనికీ ఎవరో అమ్మాయికీ ఆ వూళ్ళో సంబంధం ఉందిట. కమలను సరిగ్గా చూడడట. ఆ ముసలమ్మ ఎప్పుడూ ఏదో నెపంపెట్టి సాధిస్తునే ఉంటుందిట. అప్పుడప్పుడూ చెయ్యిగూడా చేసుకొనేది. ఇంట్లో ఎవరికి ఎటువంటి స్థానం ఉందో తెలుసుకోలేని కమల ఎవరినీ ఎదిరించి మాట్లాడేది గాదు. భర్తను ఆలస్యంగా వస్తున్నందుకు అప్పుడప్పుడు ప్రశ్నిస్తూ వచ్చిందిగాని, ముందర విసుక్కుని తర్వాత దెబ్బలు కొట్టటంగూడా మొదలు పెట్టేటప్పటికి కిక్కురుమనకుండా ఊరు కుంది. అదే తన జీవిత సరణి అని ఊరుకున్న కమలకు ఇంకొక్క ఇక్కట్టు వచ్చిపడింది. తన భర్తతో పరిచయమున్న స్త్రీ తనింటికిగూడా రావటం మొదలు పెట్టింది. తను ఉండబట్టలేక పోయింది. ఒకరోజున నాలుగు మాటలూ అడిగేసింది. భర్త గొడ్డును బాదినట్లు బాదాడు కమలను. ఇంటిల్లాపాదీ చూస్తూ ఏమీ మాట్లాడలేదు. ఆయనంటే ఇంట్లో అందరికీ భయం. ఇంకో విషయంకూడా తెలిసింది. వాళ్లు రాఘవయ్య అనుకున్నంత ఆస్థిపరులుకారు. మాట గాంభీర్యంమీద కాలం వెళ్ళదీసుకుని వస్తున్నారు. కమల భర్తతో తిరిగే చాలా ఆస్థిపరురాలు. ఆమె చరిత్ర తెలియదుగాని, ముందు వెనక ఎవరు ఉన్నట్లులేదు. ఆ కుటుంబానికి అధికంగా ఆమె ఎంతో సాయపడుతూ వస్తోందని మాత్రం కమల చూచాయగా అర్థం చేసుకుంది. మనసు విప్పి కమల ఈ సంగతులన్నీ చెప్పేసింది.

రాఘవయ్య అన్నీ విన్నాడు. తన కూతుర్ని అల్లుడు కొట్టాడని చెప్పినప్పుడు మాత్రం కోపంతో వణికిపోయాడు. తను పెంచి పెద్దచేసిన వ్యవధిలో కమలమీద ఈగను వాలనియ్యలేదుతను. కాని.... కాని.... ఈనాడు ఒక పరాయి మనిషి తన కూతురుని కొడతాడా? అసలు సంగతి తెలియటానికి ఎక్కువకాలం పట్టలేదు కమలను అల్లుడు వదిలేశాడు. అందుకనే దిగవిడచి వెళ్ళిపోయాడు. తను కమల కాపురం ఎలా సరిదిద్దాలి....

రాఘవయ్య అల్లుడిదగ్గరకు రాయబారాలు పంపాడు. తనే స్వయంగా వెళ్ళి మానాభిమానాలున్నా తన కూతురి కోసం వదులుకుని అల్లుడి కాళ్ళావెళ్ళాపడి బ్రతిమిలాడుకున్నాడు. ఇతని మాట ఆ ఇంట్లో పక్కవాళ్ళు ఆలకించలేదు. ఎన్నిసార్లో అవమానం చేసి కాళ్ళు కడుక్కోవటానికి నీళ్లుగూడా ఇవ్వకుండా పంపివేశారు.

కమల ఇంట్లో తిరుగుతుంటే నరసమ్మకూ, రాఘవయ్యకూ ఎంతో అవమానంగా ఉంది. తమ బిడ్డ తమఇంట్లో తిరగటమే కష్టంగా అనిపించ సాగింది. ల్లుఅడిని బ్రతిమిలాడి ఇక లాభంలేదేమో! అనుకున్నాడు ఆఖరికి.

'నీకేమన్నా చదువుకోవాలనిఉందా....'

'నాకిప్పుడు దేనిమీదా ధ్యాస లేదు నాన్న.... నన్నిలా ఉండనియ్యండి.... అంతేచాలు....' అంది కమల. రాఘవయ్య మళ్ళీ ఆ ప్రస్తావన తేలేదు. కమల ఇంకా పెళ్ళికావలసిన పిల్లలాగ ఇంట్లో తిరగడం మొదలు పెట్టింది,

ఆడదానికి భర్తతోటిదే జీవితం అని ఎన్నిసార్లు విన్నా, చదువుకున్నా దాని అర్థం అదివరకు తెలిసేదికాదు కమలకు అదే విషయం ఆలోచించుకో సాగింది. ఒకరోజున పక్కింటికి పోతుంటే వంటింట్లో నుంచి "ఈ అమ్మాయినే మొగుడు విడిచి పెట్టింది...." అనడం స్పష్టంగా వింది కమల. ఆ రోజుల్లా గదిలో ఒంటరిగా కూర్చుని కన్నీరు మున్నీరుగా ఏడవటం మొదలు పెట్టింది.

తన జీవితం నాశనం కావటానికి ఎవరు బాధ్యులు? ఈ ప్రశ్నకి సమాధానం ఎవరు చెబుతారు? అదే ప్రశ్న అనేకసార్లు వేసుకుంది. తన జీవితాన్ని తనే ఎలాగైనా సరిదిద్దుకోవాలి అనుకుంది ఒకరోజున ఆ ఆలోచన వచ్చి నప్పటి నుంచి తను పరాయి ఇంట్లో ఉంటున్నట్లు తలపోయ సాగింది. తల్లిదండ్రులు తనకు పరాయి వాళ్లు ఆ ఇల్లు పరాయి ఇల్లు. పరాయి ఇంట్లో తనెంతకాలం ఉంటుంది? వాళ్లకు తను బరువుకాదూ....

కమల చాలాసేపు ఆలోచించింది తను నిజంగా కుటుంబానికి బరువే. తనుండాల్సిన చోటు ఇదికాదు ఆ మాట కమలను వెంటాడింది ఇల్లంతా కాలుకాలిన పిల్లాగా తిరిగింది. ఎక్కడా స్వాస్థ్యం కుదరలేదు. దొడ్డిఅంతా తిరిగింది. తులసికోట దగ్గర నుంచుని ఆ ఇంటిన చూసింది. 'మీ ఇల్లు వదిలిపెట్టి నాదగ్గరకెందుకు వచ్చావు! అని ప్రశ్నిస్తున్నట్లు కనబడింది అక్కడినుంచి వదుగెత్తుకుంటూ వాకిట్లోకి వచ్చింది. గన్నేరుచెట్టు విరగ పూసి ప్రహారీగోడమీదకు వాలి ఉన్నాయి. అప్పుతే చీకటి పడుతోంది. అక్కడకు పోయి నిలబడింది. రెండుపూలు కోసింది. రాఘవయ్య అప్పుడే బజారునుంచి వచ్చాడు కమలను దగ్గరకు పిలిచాడు. పలకరించాడు

'మీకు బరువయ్యానునాన్నా...నేను..! అనడిగింది. రాఘవయ్య ముఖం కందింది కమల లోపలకు వెళ్ళిపోయింది....

రాఘవయ్య మనస్సు ఆ రాత్రిమరింత వికలమైపోయింది. కమల అన్నమాట నరసమ్మతో రహస్యంగా చెప్పాడు.

నరసమ్మ కళ్లువత్తుకుని 'దాని జీవితం ఇలా అయిపోయి, తను బరువు అనిపూడా అనుకోవలసి వచ్చింది....' అంది.

ఆరోజు పెద్దవాన కురిసింది. రాఘవయ్య పేపరు చదువుతూ కూర్చున్నాడు. నరసమ్మ తడిసిపోయిన బొగ్గులను గురించి విచారిస్తూ అటూ ఇటూ తిరుగుతోంది. కమల మెల్లిగా తండ్రి దగ్గరకు చేరింది

'నాన్నా.... అంటూ మెల్లగా పిలిచింది రాఘవయ్య ఉలిక్కిపడి పేపరు పక్కన పెట్టేసి 'ఏమమ్మా....' అన్నాడు,

వంటింట్లకి పోతున్న నరసమ్మ వెనక్కు తిరిగి వచ్చింది.

'ఏముంది .... అత్తవారింటికి వెళతానంటోంది....' అంది. రాఘవయ్యకు పరిస్థితి అర్థం కాలేదు

"అంటే" అంటూ ప్రశ్నించాడు" ఏమిటమ్మా కమలా.... ఇట్లారా... "

"అక్కడికి వెళదామనుకుంటున్నాను... నాన్నా...." అంది కమల. ఆ మాటల్లో నిశ్చయ భావం స్పష్టంగా కనపడింది. అన్నీ ధ్యేయం చేసుకుని చెప్పిన మాటలాగా తోచింది

"వెళ్ళి... ?!"

"అక్కడే ఉంటాను.." కమల వంచిన తల ఎత్తకుండానే అంది.

"ఒక్కసారి తనే వెళ్లి స్వయంగా చూస్తానంటోంది... పోనీ ఈ రకంగా గూడా చూస్తే సరి...." అంది నరసమ్మ.

నరసమ్మ అన్నీ చెప్పింది. కమల అత్తవారింటికివెళ్ళి తన కుటుంబాన్ని సరి చేసుకోవటానికి నిశ్చయించుకుంది అను కున్నాడు రాఘవయ్య.

"ఒక్కతివే ఎలా వెళతావు.... నేను గూడా వచ్చి నాలుగు రోజులుండ...." రాఘవయ్య ఇంకా చెప్పబోయాడు.

"మిమ్మల్ని చూస్తే మళ్ళీ రభస అవు తుందేమో నాన్నా.... ఈ సారికి నన్ను వంటరిగా పోనీయండి...." అంది కమల.

మారిపోతున్న పరిస్థితుల దృష్ట్యా రాఘవయ్య ఏమీ మాట్లాడలేక పోయాడు.

కమల ప్రయాణం ఖాయమయింది.

చేతి సంచితో. ఎందరూ పాయలలో బయలుదేరింది కమల. స్టేషనుకు ముగ్గురూ బండిమీద వెళ్ళారు.

రైలు అనుకున్న సమయానికేవచ్చింది.

కమలను పెట్టెలో కూర్చోపెట్టి బల్ల కింద సంచిపెట్టాడు. స్టేషనులో కొన్ని అరటిపళ్లు. మిఠాయి కొని చిన్న తాటాకు బుట్టలోపెట్టి యిచ్చాడు రాఘవయ్య.

బండి ఎక్కువసేపు ఆగదు. బండిలో ఎక్కిన నరసమ్మగారు ఈల ఊదటం విని గబగబా కిందికి దిగివచ్చింది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ. 'జాగ్రత్త.... జాగ్రత్త....' అంటూ ఎన్నిసార్లో చెప్పింది.

బండి బయలుదేరింది. రాఘవయ్య బండితోపాటు నడవటం మొదలుపెట్టాడు. నరసమ్మ నడవలేక ఆగింది.

'జాగ్రత్త కమలా .... వెళ్ళడంతోనే ఉత్తరం వ్రాయి ... జాగ్రత్తగా రైలు దిగూ... మళ్ళావస్తానులే వారంరోజుల్లో' రాఘవయ్య బండితోపాటు నడుస్తూ పెద్ద పెద్ద అంగలు వేస్తున్నాడు'

కమల కంట తడిపెట్టింది.

'మళ్ళీ వస్తానుగా....' దుఃఖాన్ని దిగ మింగుతూ అన్నాడు రాఘవయ్య.

'మీకు బరువయ్యా నా నాన్న....' అంటూ కమల అడిగిన మాట రాఘవయ్య చెవులో గింగురుమంటూ మ్రోగినాయి. అల్లుడు అంగీకరించకపోతే కమల ఏదన్నా అఘాయిత్యానికి దిగుతుందేమోనన్న భయం ఒక్కసారిగా రాఘవయ్యను ఆవ హించింది

"ఈబండి పక్కసారి ఆగితే బాగుం డును....కమలతో మాట్లాడాలి...." అను కుంటూ రైలువెంట పిల్లవాడిలా పరుగెత్త సాగాడు

ఈబండి ఒక్కళ్ళకోసం ఆగేదికాదు. దాని గమ్యస్థానాన్ని అన్వేషించుకుంటూ వెళ్ళిపోయింది.

(ఆకాశవాణి సౌజన్యంతో)

———o———

# నివేదన

( 12వ పేజీ తరువాయి)

టికి విడిచిపెట్టి, ఆమెను అంగీకరింప జేయడానికి తగిన సమయంకోసం వేచి ఉంటాడు

కాని శంకరం ఒకటి తలిస్తే దైవము మరొకటి తలచాడు. తిరుపతికి వెళ్ళిన వెంకటరావుగారు, కుటుంబము అక్కడ నుంచి తిరిగి వచ్చారని తెలుసుకొని శంక రం వాళ్ల యింటికివెడతాడు. కాని ఒకనాడు తాను తన తండ్రీ, మావయ్యా ఎదురుగా కూర్చొని ఉన్నా లెక్కచెయ్యకుండా ఏ విసీలకేశబంధం కాపాడడానికి సంప్ర దాయాన్ని ఎదుర్కొన్నాడో దానిస్థానంలో ప్రత్యక్షమయిన తెల్లని ముసుగుని చూసి భరింపనలవికాని దుఃఖంతో వెళ్ళిపోతాడు.

తాను అనుకొన్న దొక్కటీ సాధించ లేకపోయిన శంకరం జీవితంపై అసహ్యం కలిగి, నిరాశతో, నిస్పృహతో ఊరువిడిచి వెళ్ళిపోతాడు.

కాని కామేశ్వరికి జబ్బుచేసిందని తెలిసి అమెని చూడ్డానికి వెడతాడు. శంకరాన్ని చూడగానే ఆమె పోయే ప్రాణం నిలబడు తుంది. అక్కడే ఆమె "బావపెళ్ళికి నేను వచ్చి, దగ్గరకూర్చుని తలంబ్రాలు పోయించాలి" అంటుంది చిరునవ్వు తెచ్చుకొని.

ఆమె మనస్సుకి సంతోషం కలిగించా లన్న ఉద్దేశంతో నయితేనేమి, లేక తనలో విపరీతమైన మార్పు రావడంవల్లనయితే నేమి శంకరం రామాపురం జమీందార్ల వంశంలో పుట్టిన 'శారద'ను వివాహ మాడతాడు. ఇదొక్కటే శంకరం ఎన్నడూ ఊహించనిదీ, జీవితంలో చివరకు సాధించగల్గిందీను.

ఇదీ సంగ్రహంగా 'నివేదన' నవల ఇతివృత్తం.

ఈ నవలలో ముఖ్యంగా పేర్కొనదగి నది తెలుగు దేశం వాతావరణం.

ఉదాహరణకి వెంకట్రావుగారి వంటి లౌక్యులు, అదృష్టవంతులు, ప్రయోజకులు అయిన మేనమామలు తెలుగుదేశంలో ఎందరో ఉన్నారు.

తరువాత శంకరం పాత్రచిత్రణ ఎన్న దగినది, తనచుట్టూ సాలిగూడులా అల్లు కొని ఉన్న పరిస్థితులనే బలమైన దారాలని ఒక్కొక్క దాన్నే విదలించుకుంటూవచ్చి, చివరకు వాటికే మానవుడు ఏ విధంగా ఆత్మార్పణ చేసుకుంటాడో శంకరాన్ని చూసి గ్రహించవచ్చు.

ఈ నవలలోని కామేశ్వరి పాత్ర చిత్రణలో రచయిత కౌశల్యం కాన వస్తుంది. సంఘంలోని అంధవిశ్వాసాలకీ

( తరువాయి 20వ పేజీలో )